ప్రజాశక్తి
బుధవారం 16 ఏప్రిల్ 2025

మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణారావు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ కమిషనర్‌గా డిటివి కృష్ణారావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో పని చేస్తున్న కృష్ణారావును సిఎంఒ కార్యాలయంలో డెప్యుటేషన్‌పై నియమించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సిఫార్సు మేరకు కృష్ణారావును ఇక్కడ రెగ్యులర్ కమిషనర్‌గా నియమించారు. ప్రస్తుతం ఇంఛార్జి కమిషనర్‌గా ఉన్న డిఇ బివి ప్రసాద్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

నగర పంచాయతీ కమిషనర్ గా రత్నం రాజ్

పాలకొండ: నగర పంచాయతీ కమిషనర్‌గా రత్నరాజు నియమితులయ్యారు. విజయనగరం అసిస్టెంట్ కమిషనర్ పనిచేస్తున్న ఆయనకు ఇక్కడికి బదిలీపై రానున్నారు.

ఆశా, సిహెచ్ డబ్ల్యులకు వేతనాలు పెంచాలి

ఒప్పంద జీవోలు అమలు చేయాలి

ఎపి ఆశా వర్కర్స్, సిహెచ్‌డబ్ల్యు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని ఆశా వర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తల వేతనాలు పెంచాలని ఎపి ఆశా వర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తల సంఘం రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి కోరారు. ఆశా వర్కర్లు, సిహెచ్‌డబ్ల్యు సాధించిన వివరాలు - సవాళ్లు అన్న అంశంపై మంగళవారం ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గౌరి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఏర్పడి 20ఏళ్లు అయిందని, అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాడి సాధించుకున్నామని చెప్పారు. ఒకప్పుడు ఆశా వర్కర్లకు పనికి తగ్గ పారితోషికం నుంచి రూ.10వేలు వేతనం సాధించామని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు రూ.400 నుండి రూ.4వేలకు వేతనం సాధించామని తెలిపారు. కానీ వీరికి కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రాడ్యుటీ, యూనిఫామ్ వంటివి ఆశ వర్కర్లకు సాధించామని తెలిపారు. సిహెచ్డబ్ల్యులను ఆశాలుగా గుర్తించాలని, యూనిఫామ్ ఇవ్వాలని, రూ.26వేలు కనీస వేతనం ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, ఇఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సెలవులు, క్యాజువల్స్ సెలవులు, మెడికల్ లీవ్ ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లు, సిహెచ్ డబ్ల్యుల సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో జరుగు పోరాటంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సదస్సులో మాట్లాడుతున్న ఆశా వర్కర్స్, సిహెచ్‌డబ్ల్యు యూనియన్ రాష్ట్ర నాయకులు ధనలక్ష్మి

కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షులు వి.ఇందిర, కార్యదర్శి శివాని, సిఐటియు జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు, నాయకులు లక్ష్మి, గంగాభవానీ, రాజేశ్వరి, మాలతి, లక్ష్మి, భూలక్ష్మి, బివి రమణ, ఎన్వై నాయుడు, సూరిబాబు, జి.వెంకటరమణ, కె.సాంబమూర్తి, అధిక సంఖ్యలో ఆశలు, సిహెచ్డబ్ల్యులు పాల్గొన్నారు.

వార్డెన్ దాష్టీకం

- విద్యార్థులతో కప్పగంతులు
- మెట్లపై తల కిందకు, కాలుపైకి పెట్టి చితక్కొట్టిన వైనం
- ఏకలవ్య పాఠశాలలో ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - మక్కువ

చేయని తప్పుకు శిక్ష అంటే ఇదేనేమో... పాఠశాలలో పనిచేస్తున్న ఎఎన్ఎం ఆరబెట్టిన బట్టలు కనిపించకపోవడం పెద్ద పొరపాటైంది. ఇది విద్యార్థుల అల్లరి చేష్టల్లో పని అని భావించి ఏకంగా మూడు తరగతుల విద్యార్థులను వార్డెన్ చితక్కొట్టిన విషయం అనసభద్ర ఏకలవ్య పాఠశాలలో ఆదివారం రాత్రి జరగ్గా, మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో కొమరాడ, సాలూరు మండలాల నుంచి వారు పాఠశాలకు చేరుకున్నారు. అలాగే ఎపి గిరిజన సంఘం నాయకులు తాడంగి ప్రభాకర్, విద్యార్థి సంఘం నాయకులు, పాఠశాల కమిటీ చైర్మన్ మల్లయ్య మంగళవారం పాఠశాలకు చేరుకొని ఆరా తీశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఆదివారం ఎఎన్ఎం ఆరబెట్టిన బట్టలు కనిపించలేదు. దీంతో విద్యార్థులే వాటిని దాచి పెట్టారేమోనని భావించిన వార్డెన్ సురేష్‌బాబు 7, 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులను చిత్రహింసలకు గురిచేశారు. ఆదివారం రాత్రి సుమారు 12 గంటల వరకు డార్మెటరీ రూమ్ వద్ద కప్పగంతులు వేయించి అక్కడ మెట్లపై తలకిందులుగా పడుకోబెట్టి బాగా కొట్టారని కొమరాడకు చెందిన స్థానిక విద్యా కమిటీ చైర్మన్ మల్లయ్య, సాలూరు మండలానికి చెందిన కె.చంద్రరావు, ఎస్.ఈశ్వరరావు చెప్పారు. ఇప్పటికీ విద్యార్థులు సరిగ్గా నడవలేకపోతున్నారని కాళ్ళు, ఒళ్లు అంతా నొప్పితో బాధపడుతున్నారని వారు కలత చెందారు. సుమారు వందమంది విద్యార్థులను ఇలా చిత్రహింసలకు గురి చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

చేయని తప్పుకు విద్యార్థులను చిత్రహింసలకు గురి చేసిన ఏకలవ్య పాఠశాల వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎపి గిరిజన సంఘం నాయకులు టి.ప్రభాకర్ ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు రవికుమార్ డిమాండ్ చేశారు. హాస్టల్ వద్ద కనీస సౌకర్యాలు కూడా లేవని, అలాగే భోజన పదార్థాలు కూడా సక్రమంగా లేవని పిల్లలు తమ వద్ద వాపోయారని వారు తెలిపారు. ఈ సంఘటన జరగక ముందు నాలుగు రోజుల క్రితం సుమారు 80 మంది విద్యార్థులు ఆహారం సరిగ్గా లేక కడుపునొప్పితో రోజంతా బాధపడ్డారని, ఈ విషయం కూడా ఇప్పుడే బయటకు వచ్చిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరిపడా తాగునీటి సౌకర్యం కూడా లేదని, దీంతో ఆలస్యంగా రావడం వల్ల కూడా విద్యార్థులకు క్రమశిక్షణా చర్యల పేరుతో విద్యార్థులకు శిక్షలు వేయడం సరికాదని వారు అన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని లేదంటే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

వార్డెన్ తమను కొట్టారని చెబుతున్న విద్యార్థులు

తప్పు జరగడం వాస్తవమే..

విద్యార్థుల పట్ల వార్డెన్లు చేసిన చిత్రహింసలు తనకు ఆలస్యంగా తెలిసిందని ప్రిన్సిపాల్ బి ఎర్రునాయుడు తెలిపారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ విషయం మంగళవారం ఉదయం వరకు తన దృష్టికి కూడా రాలేదన్నారు. విద్యార్థులు కూడా చెప్పలేదని తెలిపారు. స్థానికంగా ఉన్న ఉపాధ్యాయులు కూడా తనకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారని, ఈ విషయం ఐటిడిఎ పిఒ కూడా తెలియజేమని తెలిపారు. ప్రతి శాఖ వేర్వేరుగా ఉండడం వల్ల కొన్ని విషయాలు బయటకు తెలియడంలేదని తెలిపారు. ఏది ఏమైనా ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందజేస్తామన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిసి, ప్రధమ్ సంయుక్తంగా నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ, ఉద్యోగ కల్పన జరుగుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధమ్ సంస్థ ద్వారా వెనుకబడిన, అర్థాంతరంగా స్కూల్ మానేసిన 18 నుండి 30 ఏళ్ల మధ్య వయస్సు గల యువతీ యువకులకు ఒకేషనల్ స్కిల్స్ కోర్సుల్లో (ఫుడ్, బేవరేజి సర్వీస్, హౌస్ కీపింగ్ సర్వీస్, ఫుడ్ ప్రొడక్షన్ కోర్సు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, వెల్డింగ్) 45 రోజులు శిక్షణ ఇస్తుందని అన్నారు. కనీస విద్యార్హత 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఆయన చెప్పారు. శిక్షణా కాలంలో భోజన వసతి, యూనిఫామ్, షూస్, శిక్షణకు ఉపయోగించే స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. వివరాలకు 9676965949 ఫోన్ నంబర్ కు సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

ఎస్‌జిటి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

సెకండ్ గ్రేడ్ టీచర్ పరీక్షల ఆన్‌లైన్ శిక్షణకు ఎస్‌సి. ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి ఇ.అప్పన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిఇటి పరీక్ష ఉత్తీర్ణులై, సెకండ్ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పరీక్షకు అర్హులైన స్థానికులైన బిసి, ఇబిసి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఆన్లైన్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ, స్థానికత తెలిపే ధ్రువీకరణ పత్రాలు, డిఎస్‌సికి ఎంపికైన అభ్యర్థులు, టిఇటి. (టీచర్ ఎలిజబులిటి టెస్ట్) మార్క్ లిస్ట్ జెరాక్స్, పాస్ పోర్ట్ ఫొటోలు 2 దరఖాస్తుతో జత చేయాలని సూచించారు. పూర్తి చేసిన ధరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, ఆర్‌సిఎం స్కూల్, రూం నెంబర్ 8, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా పార్వతీపురానికి పని వేళల్లో సమర్పించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

కనీస అక్షరజ్ఞానం పొందాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో వయోజన విద్యా కార్యక్రమం కింద శిక్షణ పొందే వారికి కనీస అక్షర జ్ఞానం ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం కింద చదవడం, రాయడం, పుస్తకాల నిర్వహణ, ప్రయాణ సమయంలో అసౌకర్యానికి గురికాకుండా ఉండడం, ఫోన్‌లో వచ్చే సమాచారం అర్థం చేసుకోవడం వంటి కనీస పరిజ్ఞానం ఉండాలన్నారు. ఉల్లాస్ మొదటి దశలో గతంలో 23,944 మంది అక్షరాస్యులు అయ్యారని చెప్పారు. ప్రస్తుత దశలో 25,579 మంది నిరక్షరాస్యుల్ని ఇందులో చేర్చడం జరుగుతుందని ఆయన చెప్పారు. మే 5 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిరక్షరాస్యులకు బోధనా తరగతులు ప్రారంభమవుతుందని అన్నారు. ఇందులో డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులను ముందుగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యుల్లో చదువుకున్న వారిని బోధించడానికి వాలంటీర్లుగా వినియోగించాలని ఆయన సూచించారు. ఒకరు పదిమందికి మాత్రమే చెప్పేలా తరగతులు ఏర్పాటు చేయాలని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి వైకుంఠరావు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 24 వరకు నిరక్షరాస్యుల సర్వే జరుగుతుందని చెప్పారు. మార్చి 29న మండల స్థాయిలో మండల పరిషత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎపిఎంలతో అవగాహన సమావేశం జరుగుతుందని, మే 2న గ్రామస్థాయిలో సమావేశం జరుగుతుందని చెప్పారు. బోధనా తరగతులు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు జరుగుతుందని ఆయన చెప్పారు. తరగతులు అంగన్వాడీ కేంద్రాలు, సామాజిక భవనాల్లో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్, మెప్మా, పంచాయితీ కార్యదర్శులు, విద్యాశాఖ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ, ఐసిడిఎస్ పీడీలు ఎం.సుధారాణి, పి.కనకదుర్గ, డిపిఒ టి.కొండలరావు, ఎస్ఎస్ ఎపిసి ఆర్ తేజేశ్వరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

10న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పార్వతీపురం

న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించడానికి, వివాదాలను ముందు దశలోనే పరిష్కరించడానికి లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ అధ్యక్షులు ఎస్.దామోదరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి మే 10న మొదటి జాతీయ లోక్ అదాలత్ జిల్లా కోర్ట్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలు పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, ఇతర వివాదాలను పరిష్కరించడానికి లోక్ అదాలత్ వారధిగా ఉపయోగపడుతుందన్నారు. కక్షిదారులు రాజీ చేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గుతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే కన్నా కేసులను సామరస్యం పరిష్కరించుకుని రాజీ చేసుకోవడమే ఉత్తమ మార్గమని తెలిపారు. కోర్టుకు ఎటువంటి ఫీజు చెల్లించకుండా, కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమైతే కోర్టుకు మొదట చెల్లించిన రుసుమును కక్షిదారులకు కోర్ట్ తిరిగి చెల్లిస్తుందన్నారు. లోక్ అదాలత్ లో బాధితులకు న్యాయం త్వరగా లభించే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క కక్షిదారుడు వినియోగించుకుని లబ్ది పొందాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

అంటిజోల - మణిగి బిటి రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కురుపాం :

మండలంలో జి.శివడ పంచాయతీలో గల అంటిజోల నుండి మణిగి గ్రామానికి 2.3 కిలోమీటర్ల బిటి రోడ్డును పంచాయతీరాజ్ ఎస్ఇ ఎం.శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇఇ జి.రవి మంగళవారం పరిశీలించారు. ఈ రోడ్డు వేసిన రెండు వారాలకే ఎక్కడికక్కడ పెచ్చులూడి నాణ్యత డొల్లతనం తేటతెల్లమైంది. 'కాంట్రాక్టుల నిర్లక్ష్యమా లేక అధికారుల పర్యవేక్షణ లోపం' తూతూ మంత్రంగా బీటీ రోడ్డు పనులు అన్న శీర్షికన సోమవారం 'ప్రజాశక్తి'లో కథనం వెలువడింది. ఈ కథనానికి జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ స్పందించి వెంటనే బిటి రోడ్డు నిర్మాణ పనులపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నివేదిక అందజేయాలని పంచాయత్ రాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వారు మంగళవారం ఉదయం బిటి రోడ్డు దగ్గరకు వెళ్లి నిర్మాణ పనులను పరిశీలించారు. జరిగినది వాస్తవమేనని, పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అన్నారు. అనంతరం ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు ఇంత వరకు ఎటువంటి బిల్లు చెల్లించలేదని 10 రోజుల్లో పాడైన రోడ్డంతా మళ్లీ కొత్తగా వేసి ఇస్తానన్నారని, రోడ్డు వేసిన అనంతరం తాము మళ్లీ బిటి రోడ్డు వద్దకు వచ్చి పనుల నాణ్యత పరిశీలించి అనంతరం బిల్లు పెడతామని తెలిపారు. ఈ పరిశీలనలో పంచాయతీ రాజ్ డిఇ జి.శ్రీనివాస్, ఎఇ పి.నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఇఇ రవి, అధికారులు

నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణం జరగాలి

గుమ్మలక్ష్మీపురం : జిల్లాలో చేపడుతున్న రోడ్ల నిర్మాణం నాణ్యతతో కూడుకొనేలా కలెక్టర్, సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయి బాబు, పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రోడ్డు నిర్మాణంలో నాణ్యతపై మీడియాలో వస్తున్న కథనాలపై అధికారులు స్పందించాలన్నారు. పాలకులు కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేయొద్దని కోరారు. ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే నాణ్యమైన రోడ్లు నిర్మాణం జరుగుతుందన్నారు. నాసిరకం రోడ్లు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

హామీలు అమలు చేయాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి - పాలకొండ

రాష్ట్రంలో 16 రోజుల సమ్మె సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)తో గత ప్రభుత్వంలో అధికారులు చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్. సంజీవి, సహాయ కార్యదర్శి పడాల వేణు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఎపి మున్సిపల వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన స్థానిక నగరపంచాయతీ కార్యాలయం ఆవరణంలో మంగళవారం కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రిటైర్ అవుతున్న కార్మికులకు రూ.75వేలు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తామని, వారి పిల్లలకు ఉద్యోగం ఇస్తామని గత సమ్మె ముగింపులో అధికారులు యూనియన్‌తో మినిట్స్ రాసుకున్నారని, వాటికి జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డెత్, సిక్ అయినవారి పిల్లలకు ఉద్యోగాలిస్తామని ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయడం లేదని, వెంటనే కౌన్సిల్ తీర్మానం చేసి మరణించిన, అనారోగ్యాల పాలైన కార్మికుల కుటుంబాలకు, వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పురపాలక కాంట్రాక్ట్ కార్మికులకు కూడా వయస్సు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ హామీలు అమలు చేయకుంటే భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పడాల వేణు, విమల, శ్రీదేవి, రఘు, సురేషు, ఆంజనేయులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

పాలకొండ : గ్రామ అభివృద్ధే తమ లక్ష్యమని తంపటాపల్లి ఉప సర్పంచ్ జాడ శ్రీధర్ అన్నారు. గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో అవసరమైన పనులు గుర్తించాలన్నారు. ఈ సమావేశానికి సర్పంచ్ బాబ్జీ అధ్యక్షత వహించగా ఎంపిటిసి సభ్యులు రామారావు, నీటి సంఘం అధ్యక్షులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన న్యాయమూర్తికి వీడ్కోలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

విజయనగరం జిల్లాలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జిగా పని చేస్తూ ఇటీవల గుంటూరు జిల్లాకు బదిలీ అయిన బి.కళ్యాణచక్రవర్తిని ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి మంగళవారం జిల్లా కోర్టులో మర్యాద పూర్వకంగా కలిసి, పార్వతీపురం మన్యం జిల్లా పోలీసుశాఖకు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపి, జ్ఞాపికను బహూకరించారు. జిల్లాలో పని చేసిన కాలంలో పోలీసుశాఖతో సమన్వయంతో పని చేస్తూ, మంచి సహకారాన్ని అందించారని ఆయన సేవలను ఎస్పీ కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో కొత్తగా బదిలీ అయిన గుంటూరు జిల్లాలోనూ సమర్థవంతంగా పని చేసి, న్యాయశాఖ ప్రతిష్టను మరింతగా ఇనుమటింప జేయాలని ఎస్పీ ఆకాంక్షించారు.

జడ్జి కల్యాణచక్రవర్తికి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

హౌసింగ్ లేఔట్‌ను పరిశీలించిన ప్రత్యేకాధికారి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాశీపేట వద్ద ఉన్న హౌసింగ్ లేఔట్‌ను మండల ప్రత్యేక అధికారి డి.రాజేశ్వరి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు స్థాయిని పరిశీలించే ఆయా లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, శ్రీనివాసరావు, ఎంపిడిఒ పి.త్రివిక్రమారావుతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాశీపేటలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాజేశ్వరి

విలేకరులు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన

-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-

విజయనగరం, గరివిడి, సంతకవిటి, సాలూరు, జియ్యమ్మవలస, గజపతినగరం రూరల్, కొత్తవలసరూరల్, పాలకొండ రూరల్

ఇంటర్వ్యూ : తేది: 18-04-24 శుక్రవారం ఉదయం 10 గంటలకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు : 9490099164, 9490099156, 8331011960

ప్రజాశక్తి కార్యాలయం

అశోక్ బంగ్లా ఎదురుగా, ఆర్ అండ్ బి జంక్షన్, విజయనగరం

'వీరేశలింగం పంతులు' రంగస్థల పురస్కారాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025 వ సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలను ముగ్గురికి, జిల్లా స్థాయిలో 26 జిల్లాలకు గాను, 107 మందికి కందుకూరి విశిష్ఠ పురస్కార గ్రహీతలను ఎంపిక చేసింది. ఈ పురస్కారాలకు గాను పార్వతీపురం మన్యం జిల్లా నుంచి రంగస్థలం కళాకారులు ఆర్.వాసుదేవరావు, కె.మంగాదేవి, ముమ్మల వెంకటరమణ ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం సంస్కృతిక వ్యవహారాలు శాఖ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కందుకూరి పురస్కారాలకు గానూ రూ.10వేలు నగదు బహుమతితో పాటు ప్రభుత్వం ప్రశంసా పత్రాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి వారిక్షేత్రయ్యకళాక్షేత్రంలో ఈనెల 16న సాయంత్రంప్రదానం చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టి.వి. మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తెలియచేశారు.

పాఠశాల ప్రహరీగోడను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

విద్యకు పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

విద్యావ్యవస్థకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని పెద్దగొత్తిలి పంచాయతీలో గల కొలిసిగూడ, ఆరికకొరిడి గ్రామాల్లో కొత్తగా నిర్మించిన స్కూల్ కాంపౌండ్ వాల్‌ను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యా వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పేద విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నరన్నారు. అనంతరం సర్పంచ్ టి.లోకనాథం ఆధ్వర్యంలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మాజీ ఎంపీపీ జివి రమణమూర్తి, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - పాలకొండ

మన ఊరు - మన ఇల్లు కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ స్కీం కింద మంజూరైన ఇళ్లు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం అన్నారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ స్కీములో మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. వెంటనే జియో టాగింగ్ బిల్లుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయంలో ఉన్న ఇంజినీరింగ్ కార్యదర్శులు దీనిపై దృష్టి పెట్టాలన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఎఇ మాధవరావు ఉన్నారు.

1 నుంచి వేసవి క్రీడా శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -పార్వతీపురం

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మే 1 నుంచి 31 వరకు వివిధ క్రీడాంశాల్లో వేసవి శిక్షణా తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా క్రీడా అభివృద్ధి సాధికార అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుండి 14 ఏళ్ల వయస్సు గల బాల బాలికలు అర్హులని పేర్కొన్నారు. జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు, స్కూల్ ఆటల విభాగానికి సంబంధించి శిక్షకుడు, క్రీడాంశాలు, వేదికలకు సంబంధించి ప్రతిపాదనలు శాప్ ఆమోదానికి పంపించామని అన్నారు.

17న క్రీడా సంఘాలతో సమావేశం

క్రీడా శిక్షణకు సంబంధించి ఈ నెల 17న జిల్లా క్రీడాభివృద్ధి కార్యాలయ ఆవరణలో సమీక్షా సమావేశం జరుగుతుందని, జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతిపాదనలతో సమావేశానికి హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

ఇ-పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాశీపేట, అంటిపేట గ్రామాల్లో ఇ- పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేసవిలో నువ్వు పంట నమోదును పరిశీలించారు. మండల వ్యాప్తంగా 580 ఎకరాల్లో నువ్వు పంటను ఇ- పంట నమోదు జరిగిందన్నారు. అలాగే మిగతా రైతులు ఇ- పంటను నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు రాబోయే ఖరీఫ్‌కు సంబంధించి ఇ- పంట నమోదును చేసుకొని గ్రామ సచివాలయ సిబ్బందిని ఏవైనా సమస్యలుంటే తెలియజేసుకుని పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ శాఖ సిబ్బంది జగదీష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బిటి రహదారికి మోక్షం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని సింగిడి నుంచి బిల్లుమడ మధ్య అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో పూర్తిగా పాడైన బిటి రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ చెరువును తలపించే రోడ్డుపై ప్రయాణించే వాహన దారులు ఈ రహదారికి ఎన్నేళ్లకు మోక్షం కలిగిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హయాంలో ఈ బిటి రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు జరుగుతుండడంతో ఆపేరు కూటమి ప్రభుత్వానిదేనని కూటమి నాయకులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తూన్నారు.

సన్మార్గంలో నడవాలి

ప్రజాశక్తి - కురుపాం :

మండలంలోని గొటివాడలో మంగళవారం జరిగిన నిత్య జీవ ఆశీర్వాద పండుగలో మాజీ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి దూత ఏసుక్రీస్తు మార్గంలో పయనిస్తూ సన్మార్గంలో నడవాలని, నిత్యజీవ ఆశీర్వాద పండగలకు వచ్చిన క్రైస్తవ సోదరులకు ఆమె పిలుపునిచ్చారు. మతం అనేది మనసుకు సంబంధించింది కానీ మనిషికి కాదని అందరూ సోదరభావంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌టిసి సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మత్తు పదార్థాల వినియోగం ప్రాణాలకే ప్రమాదమని, మత్తు పదార్థాలను ఎవరూ ఉపయోగించకూడదని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. ఎన్ఎస్ఎస్ పిఒ రామయ్య ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగం, నిషేధంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు గుమ్మలక్ష్మీపురం పురవీధుల్లో నినాదాలు చేస్తూ ఎల్విన్‌పేట కూడలికి చేరుకున్నారు. అక్కడ మానవహారం చేసి మత్తు పదార్థాలు వినియోగించరాదని, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐక్య ఎపి కో ఆర్డినేటర్ వి.కల్పన, తులసి, కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సికిల్ సెల్ ఎనీమియా రోగులకు అండగా ఐటిడిఎ

- 1,00,024 మందికి పరీక్షలు
- వ్యాధిగ్రస్తుల పట్ల ప్రత్యేక చొరవ చూపుతున్న పిఒ

సికిల్ సెల్ ఎనీమియా రోగుల కోసం ఏర్పాటు చేసిన వైద్యశిబిరం (ఫైల్)

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో అధికంగా కనిపించే అరుదైన వ్యాధుల్లో సికిల్ సెల్ ఎనీమియా ఒకటి. కొండలు కోనల్లో, శివారు ప్రాంతంలో జీవనం సాగిస్తున్న గిరిజనులకు కనీసం వ్యాధి ఉందని కూడా తెలియని పరిస్థితి. ఈ వ్యాధి బారినబడి కొంతమంది మృతి చెందారు. సికిల్‌సెల్ ఎనీమియా ఉన్నవారు కళ్లు తిరిగి పడిపోవడం, రక్తం రోజురోజుకూ తగ్గిపోవడం, నీరసించి పోవడం వంటి లక్షణాలతో తరచూ బాధపడుతుంటారు. ఈ వ్యాధి నిర్మూలనకు సరైన చికిత్సా విధానం లేకపోవడంతో అనేక మంది మృతువాతపడుతున్నారు.

రోగుల పట్ల పిఒ ప్రత్యేక శ్రద్ధ

సీతంపేట ఐటిడిఎ పరిధిలోని 20 మండలాల్లో పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి గిరిజన గ్రామాలను సందర్శించి, అక్కడి గిరిజం కష్టాలు తెలుసుకోవడంతో పాటు ఆసుపత్రిలో తనిఖీ చేయడం వంటివి చేపడుతున్నారు. ఈ తనిఖీల్లో సికిల్‌సెల్ ఎనీమియాతో ఎక్కువ మంది గిరిజనులు బాధపడుతున్నట్టు గుర్తించారు. గిరిజనులు అసలే నిరుపేదలు. ఈ రోగులకు ప్రభుత్వం నెలకు రూ.10వేలు పెన్షన్ మంజూరు చేసిన్నట్టు కూడా తెలియదు. కొంతమందికి తెలిసినప్పటికీ ఐదేళ్లుగా విశాఖ కెజిహెచ్‌లో వైద్య పరీక్షలు చేసి ఇచ్చిన ధ్రువపత్రం కోసం కాళ్లు అరిగేలా తిరిగినప్పటికీ అందకపోవడంతో పెన్షన్లు రాని ఎంతో మంది సికిల్ సెల్ ఎనీమియా బాధితుల బాధలకు పిఒ చలించిపోయారు. దీంతో ఆయన ఒక అడుగు ముందుకేసి ఐటిడిఎ ఆధ్వర్యాన అన్ని గిరిజన గ్రామాలు, ఆశ్రమ పాఠశాలల్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. 0 నుండి 40 ఏళ్ల గల లక్షా24 మందికి పరీక్షల్లో నిర్వహించారు. పాజిటివ్ వచ్చిన వ్యాధిగ్రస్తులకు 225 మందిని సీతంపేట వైటిసిలో విశాఖ కెజిహెచ్ నుంచి ప్రత్యేక వైద్య బృందాన్ని రప్పించి హెచ్‌పిఎల్‌సి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 110 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు గుర్తించారు. వీరికి కెజిహెచ్ వైద్య బృందం ద్వారా ధ్రువపత్రాలు పిఒ దగ్గర ఉండి ఇప్పించారు. అంతేకాకుండా ఐటిడిఎ పరిధిలోని పిహెచ్‌సి వైద్యాధికారులకు సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పింఛన్‌కు అవసరమయ్యే దరఖాస్తులను ఐటిడిఎకు సమర్పించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ దరఖాస్తులను పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల డిఎంహెచ్‌ఒ కార్యాలయాలకు పంపించి పరిశీలన చేయించి త్వరగా పింఛను మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కెజిహెచ్ హెచ్‌బిఎల్‌సి ధ్రువపత్రాల కోసం కాళ్లు అరిగేలా తిరిగినప్పటికీ అందని ధ్రువపత్రాలు పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి కృషితో రోగులకు రూ.10వేలు పెన్షన్లు అందడంతో వారు ఎంతో సంతోషపడుతున్నారు.

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు పాజిటివ్ ధ్రువపత్రం

ఐటిడిఎ పరిధిలో గల అనేక మంది సికిల్ సెల్ ఎనీమయా వ్యాధిగ్రస్తులకు పాజిటివ్ ధ్రువపత్రం లేకపోవడంతో పింఛన్ అందడం లేదు. విశాఖ కెజిహెచ్‌కు వెళ్లి ధ్రువపత్రం చేయించుకోలేక చాలామంది పింఛన్‌కు కోల్పోతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కెజిహెచ్ ఆసుపత్రితో మాట్లాడి ఒక ప్రత్యేక బృందంతో సీతంపేట వైటిసిలో సికిల్ సెల్ ఎనిమియా హెచ్‌పిఎల్‌సి పరీక్ష నిర్వహించాం. ఈ పరీక్షలో పాజిటివ్ వచ్చిన వారికి సంబంధిత పిహెచ్‌సి వైద్యాధికారులు ప్రభుత్వం మంజూరు చేసే పింఛన్ కావాల్సిన అర్హత పత్రాలు సమర్పించి ప్రతి నెలా పింఛన్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం.

సి యశ్వంత్ కుమార్ రెడ్డి,
పిఒ సీతంపేట ఐటిడిఎ.

పనులిస్తామని చెప్పి.. మాట తప్పారు

ఎంపిపిని నిలదీసిన ఎంపిటిసి సభ్యులు

ప్రజాశక్తి - కొమరాడ

తమ గ్రామంలో అభివృద్ధి పనులు ఇస్తామని గత సమావేశంలో మాటిచ్చారని, ఆ హామీని నేటికీ నెరవేర్చలేదని పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిపి శెట్టి శ్యామల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉదయం 11 గంటలైనా వైసిపి ఎంపిటిసి అభ్యర్థులు పూర్తిస్థాయిలో సమావేశానికి హాజరు కాలేదు. దీంతో సమావేశం నిర్వహించడానికి కోరం లేక వాయిదాపడే సమయంలో టిడిపి ఎంపిటిసి సభ్యులంతా సమాశానికి హాజరవ్వడంతో ఎంపిపి సమావేశానికి కొనసాగించారు. ఇందులో భాగంగా మండల ఇంజనీరింగ్ అధికారి రంజిత్ ఇటీవల మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు పనులు వివరాలను వెల్లడించారు. ఇదే సమయంలో విక్రాంపురం ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకటనాయుడు మాట్లాడుతూ టిడిపి ఎంపిటిసి సభ్యులకు మండల పరిషత్ నుంచి నిధులు కేటా ఇస్తామని చెప్పారు కానీ నేటికీ నిధులు తమకు కేటాయించకపోవడంపై ప్రశ్నించారు. దీంతో ఎంపిపి మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇస్తున్న గోశాలలు, బిసి కార్పొరేషన్ రుణాలు కనీసం వైసిపి ప్రజా ప్రతినిధులు కానీ, సర్పంచులకు గానీ చెప్పకుండా టిడిపి నాయకులే చేయడం న్యాయమా అని ప్రశ్నించారు. టిడిపి ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ తాము ఈ సమావేశానికి రాకపోతే అసలు సమావేశమే జరిగే పరిస్థితి ఉండేది కాదని, మండలాన్ని అభివృద్ధి చేసుకొనేలా కలిసిమెలిసి పనిచేసుకోవాలని వెంకటనాయుడు అన్నారు. అలాగే ఇళ్ల బిల్లుల మంజూరుపై వైసిపి, టిడిపిల మధ్య స్వల్ప వివాదం జరిగింది. అనంతరం ఎంపిడిఒ మల్లికార్జునరావు మాట్లాడుతూ మండలంలో అన్ని రగామాలను అభివృద్ధి చేసుకొనేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసుకోవాలన్నారు. డిటి జి.హేమలత మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో చేపట్టిన రీసర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసుకునేందుకు చేపట్టిన వినతుల స్వీకరణలో వచ్చిన వాటిని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జడ్పిటిసి సభ్యులు డి.లక్ష్మి, వైస్ ఎంపిపి కె.అన్నపూర్ణ పలువురు మండల శాఖ అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపిటిసి సభ్యులు వెంకటనాయుడు

కుమార్తెను తీసుకొని సమావేశానికి వచ్చిన వైస్ ఎంపిపి

బాధ్యత కోసం బరువు అనుకోకుండా పిల్లతో సమావేశానికి గిరిజన వైస్ ఎంపిపి

గిరిజన ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని బాధ్యతగా తీసుకొని బాధ్యత కంటే బరువు గొప్పది కాదని చోళ్ల పదం ఎంపిటిసి సభ్యులు, వైస్ ఎంపీపీ కేంద్రుక అన్నపూర్ణ నిరూపించుకున్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు ముందుగానే సమాచారం ఇవ్వడంతో తన రెండున్నరేళ్ల కుమార్తెను ఇంటి వద్ద చూసేవారు ఎవరూ లేకపోవడంతో సమావేశంలో హాజరు కావడం తన బాధ్యత తప్పనిసరి కావడంతో సమావేశానికి కుమార్తెను తీసుకొని సమావేశానికి వచ్చి స్టేజిపై కూర్చొని ఆదర్శంగా నిలిచారు.

తాగు నీటి పథకాల క్లోరినేషన్ చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా విస్తృత చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్యపై వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలపై కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా అధికారులు స్పష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, తాగునీటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి పథకాలకు మెట్లులేకపోతే తక్షణం మెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్య ఏర్పడినప్పుడు వెంటనే పనులు చేపట్టాలని, జిల్లా పరిషత్ నిధులు మంజూరు కానుందని ఆయన పేర్కొన్నారు. పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలు, వీరఘట్ట, సీతంపేట తదితర మండలాల నుంచి తాగునీటి సమస్యపై వచ్చిన అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వేసవి దృష్ట్యా చలివేంద్రాలను అన్ని చోట్లా ఏర్పాటు చేయాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. అవసరమైన అన్ని ప్రదేశాల్లో చలివేంద్రం ఉండాలన్నారు. ప్రజలు వేసవి దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ వంటి ఆరోగ్య పరమైన సమస్యలు రాకుండా జాగ్రత్త వహించాలని కోరారు. శ్రీకాకుళం జెడ్పీ సిఇఒ రాజు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా నుంచి అందిన రూ.50 లక్షలు ప్రతిపాదనలు త్వరలో మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణ సరఫరా అధికారి ఒ.ప్రభాకర్ రావు, డిపిఒ టి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జీడిలో అంతర పంటలు వేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

జీడీలో అంతర పంట వేస్తూ, పిజిఎస్ సర్టిఫికేషన్ చేయాలని ప్రకృతి వ్యవసాయ విభాగ ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖరాజు అన్నారు. స్థానిక మండల మహిళ సమైక్య కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి, మన్మధరావు ఆధ్వర్యంలో మండల స్థాయి కన్వర్జెన్స్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో షన్ముఖరాజు మాట్లాడుతూ నవధాన్యాల సాగు, విధానం కెఎపి ద్వారా ప్రతి రైతుకు చేరువయ్యేలా చేయాలని చెప్పారు. వ్యవసాయ శాఖ, అనుబంధ సంస్థలు, సర్ఫ్ ఉపాధి వాసన అనుబంధ సంస్థలు సూచనలు తీసుకోవాలన్నారు. కో-ఆర్డినేటర్ రమణ, ఆర్ఫ్ కోఆర్డినేటర్ కృష్ణ, వెలుగు అసోసియేషన్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరావు, ప్రకృతి వ్యవసాయం, రైతులకు నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎపిఎం కమల కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం రైతులకు, కావాల్సి ఇన్‌పుట్స్‌కు సంబంధించి అవసరమైన రుణసదుపాయం అందించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది బాలు, వెలుగు సిబ్బంది, ఎన్జీవో ప్రతినిధులు, ఎపిఒ సాగర్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంట మార్పిడితో ప్రయోజనాలు

ప్రజాశక్తి - పాచిపెంట

పంట మార్పిడి వల్ల కొంతవరకు ప్రయోజనాలను సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలిలో రైతులు పాంచాలి ఈశ్వరరావు, కలువలపల్లి సోంబాబు క్షేత్రాల్లో వేసవి పెసర, మినుము విత్తనాలను చెల్లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి అపరాల సాగుతో అదనపు ఆదాయం వస్తుందని, ఈ ఆదాయంతో వచ్చే ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడి కలిసి వస్తుందని వేసవి అపరాలు సాగు ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. నేలను వేసవిలో అధిక వేడి నుంచి కాపాడుతుందని,అపరాల వేర్ల గుడిపల్లి మీద ఉండే రైజోబియం బ్యాక్టీరియా గాలిలో ఉండే నత్రజని భూమిలో స్థిరీకరించి ఖరీఫ్ పంటకు అందిస్తుం తెలిపారు. పైరు వ్యర్థాలను కలియ దున్నడం వల్ల నేలలో సేంద్రియ పదార్థం పెరుగుతుందని, ప్రస్తుతం 50 శాతం రాయితీపై విత్తనాలు అందజేయబడుతున్నాయని, కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి వేసవి అపరాల సాగు ద్వారా భూమిని కాపాడుకుంటూ అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి సేద్య ఎల్ వన్ తిరుపతినాయుడు పెసర, మినుము పంటలకు విత్తన గుళికలు తయారు చేయించారు. కార్యక్రమంలో విఎఎలు శ్రీను, దినేష్, బాలకృష్ణ, గణేష్, అనిల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

ప్రజాశక్తి - కురుపాం

మన్యం జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ఉండడంతో ప్రజలు అసౌకర్యానికి గురైయ్యారు. తొలుత కారు మబ్బులు కమ్ముకోవడంతో చీకటి వాతావరణం ఏర్పడింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మధ్యాహ్నం 3 గంటల తర్వాత భారీగా వాన కురిసింది. వర్షం పడడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం లభించింది. ఈ వర్షంతో ఆరుతడి పంటలు కొంత ఉపశమనము లభిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగింది. విద్యుత్ సరఫరా సాయంత్రం వరకు నిలిచిపోయింది.

సీతంపేట : సీతంపేటలో మంగళవారం సాయంత్రం వర్షం కురవడంతో కొంత ఉపశమనం కలిగింది. గత కొద్ది రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు వేడికి అల్లాడిపోతున్నారు. ఈ తరుణంలో మంగళవారం సాయంత్రం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

వీరఘట్టం : మండలంలోని గాలులతో కూడిన వర్షం పడింది. ఎండల తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో కొంతమేరకు ఉపశమనం ఇచ్చిందని స్థానికులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

భామిని : మండలంలో మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ప్రస్తుతం పత్తి పంటలు వేసే వారు వేసవి దుక్కులు ప్రారంభానికి ఈ వర్షం అనుకూలమని పత్తి రైతులు తెలిపారు.

వీరఘట్టంలో కురుస్తున్న వర్షం

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

రహదారి భద్రతా నియమాలపై ఎస్సై పి.నారాయణరావు స్థాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బస్టాండ్ వద్ద మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనాలు ఎదురెదురుగా వచ్చేటప్పుడు ఎలా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనేది తాను చేయితో చేసి విపులంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అంతేకాకుండా గ్రామాల్లో కూడా ప్రజలకు వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు ఎల్విన్‌పేట పోలీసులు అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఏ విధంగా పాటించాలనే దానిపై గుణుపూర్ కూడలి వద్ద ఎస్సై బిడ్డిక శివప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు అనుమతి పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, పరిమితికి మించి వాహనాలపై ఎక్కించరాదని సూచించారు.

కురుపాంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారులు భారతి, ప్రదీప్‌కుమార్

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రి స్త్రీ వైద్య నిపుణులు రౌతు భారతి, స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ 55 మంది గర్భిణీలకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటు, మధుమేహ, ఎత్తు, బరువు, రక్తహీనత, తదితర రకాలైన ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి సూచనలు, సలహాలు అందజేసి మందులు పంపిణీ చేశారు. శ్రీకాకుళం గురజాడ విద్యాసంస్థల అధినేత జివిఎ నాయుడు తల్లిదండ్రులు జగ్గునాయుడు, గౌరమ్మ జ్ఞాపకార్థంగా శ్రీ సత్య సాయి సేవ నిత్య అన్నపూర్ణ సంస్థ ఆధ్వర్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణీలకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్దన్‌రావు, శాంతకుమారి, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటిడిఎ పిఒ యస్వింత్‌కుమార్‌రెడ్డి

అగ్నిమాపక వారోత్సవాల బ్యానర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - సీతంపేట

అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని ఆ శాఖ ప్రచురించిన కరపత్రాలు బ్యానర్లను ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాలకొండ అగ్నిమాపకాధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది, పులిపుట్టి భారతి ఇంటర్నేషనల్ పాఠశాల స్కౌట్స్, గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ గేదెల సంతోష్ కుమార్, స్కౌట్ మాస్టర్ ఆర్.శ్రీను పాల్గొన్నారు

వీరఘట్టం పాలకొండ అగ్నిమాపక శకటం ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జామి సర్వేశ్వరరావు అగ్ని ప్రమాదంపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు.

రైలు ఢీకొని యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - కొమరాడ

గుర్తుతెలియని రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఆర్తాంలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ రత్నాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం అర్తాం - సోమినాయుడు వలస రైల్వే గేటు మధ్యలో రైలు పట్టాలు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని రైలు ఢీకొని కొప్పర వెంకట రమణ (26) మృతి చెందినట్లు తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న పొలం చూసేందుకు వెళ్తున్న సమయంలో పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలని జిల్లేడు వలస పంచాయతీ గిరి శిఖర గ్రామం నారింజ పాడుకు చెందిన గెమ్మెల మహేష్ (38) పురుగుల మందు తాగి మరణించాడు. స్థానికుల కథనం ప్రకారం మహేష్‌కు గత కొంతకాలం క్రితం అదే గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహం జరిగింది. వివాహం జరిగిన వాటి నుండి భార్యాభర్తలు నిత్యం గొడవలు పడడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ మేరకు మంగళవారం తన వ్యవసాయానికి ఉపయోగించే పురుగులు మందులు తాగి బలవర్మాణానికి పాల్పడ్డాడు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సాలూరు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు.

30 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మ చాపారాయగూడ గ్రామానికి చెందిన బిడ్డక శ్రీను 30 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకున్నామని ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే కురుపాం గ్రామానికి చెందిన కలప రాజేష్ దగ్గర 100 నాటు సారా ప్యాకెట్లు పట్టుకున్నట్లు తెలిపారు. సారాను స్వాధీన పరచుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.